

పాఠశాల నిర్వహణ నిధులు విడుదల

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సర్కారు పాఠశాలలకు నిర్వహణ నిధులను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. నిర్దేశించిన మొత్తంలో 50 శాతం నిధులను విడుదల చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు వెలువరించారు. సంగారెడ్డి జిల్లాకు రూ. 1.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మొత్తాన్ని జిల్లాలోని 1,108 పాఠశాలల ఖాతాల్లో జమ చేయనున్నారు. నిధులు విడుదల కావడంతో బడుల నిర్వహణకు ఇబ్బందులు తప్పుతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్'

జాతీయ సమైఖ్యతకు ప్రతీక : కలెక్టర్



మార్చ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా సంగారెడ్డిలో నిర్వహించబోయే 'మేరా యువభారత్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె 'సర్దార్ ఎట్ 150 యూనిటీ మార్చ్' పోస్టర్‌ను విడుదల చేశారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, పోలీస్, విద్య, వైద్య తదితర ప్రభుత్వ శాఖలు ఈ కార్యక్రమంలో భాగస్వామం కావాలని కోరారు. అంతకుముందు జిల్లా యువజన శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి మెదక్ జిల్లా మై భారత్ అధికారి రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ అక్టోబరు 31వ తేదీ నుంచి నవంబరు 25 వరకు నిర్వహించబోయే పటేల్ జయంతి వేడుకలను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుందన్నారు. మేరా యువ భారత్ ఎక్తా ర్యాలీలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి ఖాసీంబేగ్, జిల్లా కార్యక్రమ అధికారి కిరణ్‌కుమార్, జిల్లా కోఆర్డినేటర్లు రాజుగౌడ్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం విజిలెన్స్ అవగాహన సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

సదర్ ఉత్సవంలో స్టెప్పులేసిన జగ్గారెడ్డి

సంగారెడ్డిలో ఘనంగా పెద్దగొల్ల సదర్ ఉత్సవం

- ఆకట్టుకున్న దున్నరాజుల విన్యాసాలు
- పాటలతో జోష్ తెప్పించిన గాయకులు



మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



పెద్దగొల్ల సదర్ ఉత్సవంలో దున్నరాజులతో జగ్గారెడ్డి

సంగారెడ్డిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో పెద్దగొల్ల సదర్ ఉత్సవం ఘనంగా జరిగింది. దున్నరాజుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. యువత అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. వారిలో జోష్ నింపేలా సింగర్స్ పాటలు పాడారు. ఈ సదర్ ఉత్సవంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఫోటోలు దిగి.. స్టెప్పులేసి

సదర్ ఉత్సవానికి హాజరైన జగ్గారెడ్డి అందరిలో జోష్ నింపారు. కార్యక్రమానికి వచ్చిన వారు ఆయనతో ఫోటోలు దిగేందుకు ఆసక్తి ప్రదర్శించారు. అనంతరం అక్కడున్న వారితో కలిసి జగ్గారెడ్డి స్టెప్పులు వేశారు. సదర్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించిన ప్రతినిధులను ఆయన అభినందించారు.

ముంచిన మొంథా

వరి రైతుకు తుపాన్ దెబ్బ

కురుస్తున్న వర్షాలు.. తడుస్తున్న వడ్లు

జోరందుకోని ధాన్యం సేకరణ

మెదక్ జిల్లాలో 510 సెంటర్లు

121 కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోళ్లు

మెదక్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుపాను రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నది. వరి కోతల వేళ వర్షాలు కురుస్తుండటంతో ఉసూరుమంటున్నారు. ఇప్పటికే సుమారు 60 శాతం కోతలు పూర్తయ్యాయి. కోతలకు సిద్ధంగా ఉన్న మిగిలిన పంట పొలాల్లోనే తడిసి ముద్దవుతున్నది. తుపాను ప్రభావంతో మెదక్ జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. అత్యధికంగా రేగోడులో 41.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చిలప్‌చెడ్‌లో 24.3, కొల్చారంలో 37.3, పాపన్నపేటలో 29.3, నర్సాపూర్‌లో 25 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. మిగిలిన మండలాల్లో మోస్తరు వర్షాలు పడుతున్నాయి. వర్షాలకు ధాన్యం కల్లాల్లోనే తడిసిపోతున్నది.

మొదలుకాని కొనుగోళ్లు

మెదక్ జిల్లాలో 3 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేయగా, ఇప్పటి వరకూ లక్షా 60 వేల ఎకరాలలో వరి కోతలు పూర్తయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. మిగతా వరిపంట కూడా మరో వారం రోజుల వ్యవధిలో కోతలు పూర్తి కావచ్చునని అంచనా వేస్తున్నారు. జిల్లాలో 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. రైతుల నుంచి ధాన్యం సేకరించడానికి జిల్లాలో 510 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కానీ, 121 కేంద్రాల్లోనే కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కోతలు పూర్తికాకపోవడమే ఇందుకు కారణమని అధికారులు చెబుతున్నారు. కొన్నిచోట్ల కోతలు పూర్తయినా తేమ శాతం ఎక్కువగా ఉందని సేకరించడం లేదు. తేమ 17 శాతం లోపల ఉంటేనే సేకరిస్తామని నిర్వాహకులు చెబుతున్నారు. పైగా తడిసిన ధాన్యాన్ని తీసుకుంటే నాణ్యత తగ్గిపోతుందని అంటున్నారు. ఇక ప్రతీ సెంటర్‌కు 1,480 టార్పాలిన్లు ఇచ్చామని సివిల్‌సప్లై శాఖ అధికారులు చెబుతున్నా రైతులకు అవి అందకపోవడంతో అద్దెకు ప్లాస్టిక్ కవర్లు తెచ్చుకుని ధాన్యం రాశులకు కప్పుతున్నారు.



వెల్దుర్తి సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం



చేగుంటలో హైవేపై వర్షానికి కొట్టుకుపోతున్న వడ్లను ఎత్తుతున్న రైతులు

అకాల వర్షం.. ఆగమాగం

- చిలప్‌చెడ్: మండల పరిధిలోని శీలంపల్లి, ఫైజాబాద్, చండూరు, సోమక్కపేట, గంగారం, అజ్జమర్రి జగ్గంపేట తదితర గ్రామాల్లో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయింది. ధాన్యమంతా నీటి పాలయిందని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు.
- వెల్దుర్తి: అకాల వర్షానికి మండలంలోని పలుచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. వెల్దుర్తి సొసైటీ వద్ద ధాన్యం కుప్పల మధ్య వర్షం నీరు చేరింది.
- మనోహరాబాద్: మండల కేంద్రంలో రైతులు ఆరబోసిన వడ్లు వర్షానికి కొట్టుకుపోయాయి. మండలంలో ఇప్పటివరకు కొనుగోలు కేంద్రం తెరవకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు.
- చేగుంట: మండలంలోని పలు గ్రామాల్లో హైవే 44 బైపాస్ రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది. కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లడానికి సిద్ధమవుతున్న తరుణంలో ధాన్యం తడిసి ముద్దయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

సంగారెడ్డి జిల్లాలో..

- జోగిపేట రూరల్: సంగారెడ్డి జిల్లా అందోలు మండలంలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి జోగిపేట, అందోలు, అన్నాసాగర్, పోసానిపేట, సంగుపేట, అల్మాయిపేట తదితర గ్రామాల్లో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. జోగిపేట మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయింది. కేంద్రం నిర్వాహకులు టార్పాలిన్లు ఇవ్వకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.
- పుల్‌కల్: అకాల వర్షానికి పుల్‌కల్, చౌటకూర్ మండలాల్లో సోమవారం రాత్రి, మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి వడ్లు తడిసిపోయాయి. మండలంలో జాతీయ రహదారి, సర్వీసు రోడ్లు, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయింది.
- నారాయణఖేడ్: నారాయణఖేడ్ డివిజన్‌లో మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి వరి, పత్తి తడిసిపోయాయి.
- జహీరాబాద్: పట్టణంలో సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి డ్రైనేజీలు పొంగిపొర్లడంతో అంతర్గత రహదారులు బురదమయంగా మారాయి.
- కోహీర్: మండలంలోని పలు గ్రామాల్లో వర్షానికి పత్తి పంటకు నష్టం జరిగింది. యాసంగిలో సాగు చేసేందుకు ఆగ్రా, మహారాష్ట్ర నుంచి తీసుకువచ్చిన ఆలుగడ్డ విత్తనం పాడైపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.



వరి కోతలు వాయిదా వేసుకోవాలి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో మూడు రోజులు వర్షం కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మహ్మద్‌నగర్‌లో కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రైతులకు టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, ఈఏసీఎస్ దుర్గాగౌడ్, ఆర్ఐ శ్రీహరి ఉన్నారు.



వడ్లలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బిజెపి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఇంట పెళ్లి వేడుకలు

- ఘనంగా కుమారుడు ఆనీస్‌రెడ్డి వివాహ మహోత్సవం
- హాజరైన అతిరథమహారథులు



వివాహ వేడుకలకు హాజరైన సిఎం రేవంత్ రెడ్డి



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీమంత్రి కేటీఆర్



నూతన దంపతులను అభినందిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపి రఘునందన్‌రావు



వివాహ వేడుకలలో కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్

\- రాంచంద్రాపురం టౌన్

ప్రభుత్వ భూమిపై వివాదం

ప్రైవేటు వ్యక్తులతో కాలనీ వాసులు ఘర్షణ.. సర్వే ఏడీ రావడంతో ఉద్రిక్తత

కాలనీలో ఇళ్లే ప్రభుత్వ స్థలంలో నిర్మించారని ఆరోపణలు

రేయిన్‌బో మీడోస్ కాలనీలో రెండువర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు

రెవెన్యూ, మున్సిపల్, హెచ్ఎండీఏ సంయుక్త విచారణకు డిమాండ్



రెయిన్‌బో కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని చూపుతున్న కాలనీవాసులు

అమీన్‌పూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాలనీ మధ్యలో ఉన్న ప్రభుత్వ స్థలం తమదంటూ కొందరు వ్యక్తులు స్వాధీనం చేసుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఉద్రిక్తంగా మారాయి. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట పరిధిలోని రెయిన్‌బోమీడోస్ కాలనీలో కొద్దిరోజులుగా విలువైన ప్రభుత్వ స్థలంపై వివాదం నెలకొంది. హెచ్ఎండీఏ అనుమతితో ఏర్పాటు చేసిన కాలనీ మధ్యలో సర్వే నంబర్ 208, 210లో ఎకరా ఆరు గుంటల ప్రభుత్వ భూమి ఉంది. రూ.కోట్లు విలువైన ఆ స్థలం తమదేనని ఇటీవల కొందరు వ్యక్తులు డాక్యుమెంట్లు, పట్టాదారు పాసుపుస్తకాలను చూపుతూ స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదటుపెట్టారు. సదరు స్థలంపై ఎవరికి యజమాన్య హక్కులు ఉన్నాయన్నదానిపై ఇంతవరకు రెవెన్యూ అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వెంచర్ చేసిన బిల్డర్ ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి ఇళ్లు కట్టాడని, ఇప్పుడు తమ పట్టా భూమిని ప్రభుత్వ భూమి అని చెప్పడం విడ్డూరంగా ఉందని పట్టాదారు పాసుపుస్తకాలు చూపుతున్న యజమానులు కాలనీవాసులపై మండి పడుతున్నారు. రెవెన్యూ రికార్డులు, టిప్పన్‌మ్యాప్, గ్రామ నక్షా ప్రకారం తమ పట్టా భూమిని చూపించే బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని వాదిస్తున్నారు. మరోవైపు రెయిన్‌బో మీడోస్ కాలనీలోని కొన్ని ఇళ్లు

మిగతా 8వ పేజీలో



42 మందికి డిప్యూటేషన్లు

సంగారెడ్డి కలెక్టర్‌కు డీసీహెచ్ఎస్ నివేదిక

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో జిల్లావ్యాప్తంగా 42 మందికి డిప్యూటేషన్లు ఇచ్చినట్లు జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) షేక్ మహ్మద్ షరీఫ్ మంగళవారం సంగారెడ్డి కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. ఇందులో డాక్టర్లు, నర్సింగ్ సూపరింటెండెంట్లు, హెడ్‌నర్సులు, స్టాఫ్‌నర్సులు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లుతో పాటు నాలుగో తరగతి ఉద్యోగులున్నారు. డిప్యూటేషన్లు ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందనే కారణాలను డీసీహెచ్ఎస్ ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చుకున్నట్లు తెలిసింది. 'వైద్య శాఖలో పైసా వసూల్' శీర్షికతో ఈ నెల 27న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన కలెక్టర్ ప్రావీణ్య సమగ్ర నివేదిక ఇవ్వాలని డీసీహెచ్ఎస్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాలమేరకు ఆయన మంగళవారం నివేదిక సమర్పించారు. అయితే, వైద్యశాఖలో వసూళ్లపై వచ్చిన ఆరోపణలపై వారంలో టీవీవీపీ విజిలెన్స్ విభాగానికి సంబంధించిన అధికారులు సమగ్ర విచారణ జరిపే అవకాశముందని వైద్యశాఖ వర్గాలు తెలిపాయి. ఇటీవల వైరల్‌గా మరిన ఆడియో, వీడియోల ఆధారంగా ఇందులో ప్రమేయం ఉన్న ప్రతీఒక్కరి నుంచి వ్యక్తిగతంగా వివరణ తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఘటనపై ఏసీబీ అధికారులు కూడా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. డిప్యూటేషన్ల వ్యవహారం బహిర్గతం కావడంతో అధికారులు, ఉద్యోగులు ఎప్పుడేం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.

విద్యుత్‌శాఖలో ఆర్టిజన్‌లదే రాజ్యం

ఒక్కో పనికి ఒక్కో రేటు..

అడిగినంత ఇస్తేనే పని

ఉన్నతాధికారుల కనుసన్నల్లోనే వసూళ్లు!

సంగారెడ్డి సర్కిల్ పరిధిలో దందా



సంగారెడ్డి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా విద్యుత్‌శాఖలో ఆర్టిజన్ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో పనికి ఒక్కో రేటును నిర్ణయించి వసూళ్ల దందాకు పాల్పడుతున్నారు. విద్యుత్ బిల్లులు వసూలు చేయడం, మీటర్ల ఏర్పాటు, మెయింటనెన్స్ పనులను ఆర్టిజన్లు చేయాల్సి ఉంటుంది. కానీ కొందరు తమ విధులను మరిచి ఏఈ, ఏడీఈ స్థాయి అధికారులు నిర్వహించాల్సిన పనులను ఆర్టిజన్‌లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సంగారెడ్డి ట్రాన్స్‌కో (విద్యుత్ శాఖ) సర్కిల్ పరిధిలోని ఇస్నాపూర్ సబ్ డివిజన్‌లో వసూళ్ల దందా జోరుగా సాగుతున్నదని చర్చించుకుంటున్నారు. ఇస్నాపూర్ డివిజన్‌లో వందలాది భారీ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు, వేలాదిగా బహుళ అంతస్తులు, అపార్టుమెంట్లతో పాటు భారీ వెంచర్లు వారికి కల్పవృక్షంలా మారాయి. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఆర్టిజన్‌లు తమ విధులను విస్మరించి కేవలం వసూళ్లకే పరిమితమైనట్లు ఆరోపణలున్నాయి. వీరిలో ఒకరిని నాలుగు సంవత్సరాల క్రితం కొల్లూరు ప్రాంతానికి బదిలీ చేసినప్పటికీ ఉన్నతాధికారుల అండదండలతో ఇక్కడే విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఇతను పలు పరిశ్రమల్లో కాంట్రాక్టులు కూడా చేస్తున్నట్లు

మిగతా 8వ పేజీలో

నర్సాపూర్‌లో ఎకో పార్కు త్వరలో ప్రారంభం

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



ఎకో పార్కులోని కాటేజీలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ అర్బన్‌పార్కు సమీపంలో నిర్మించిన ఎకో కాటేజీలు త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి జోజీతో కలిసి మంగళవారం ఆయన కాటేజీలను పరిశీలించారు. ఎకో పార్కులో 42 కాటేజీలను అటవీశాఖ, ప్రైవేటు యాజమాన్యం సహకారంతో నిర్మిస్తున్నామని తెలిపారు. కాటేజీలో అందుబాటులోకి వస్తే నర్సాపూర్ అడవి పర్యాటక కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. అర్బన్‌పార్కు వద్ద సౌకర్యాలను కల్పించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఆర్డీవో మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మర్.. డర్..!


గతేదాది హత్యకు గురైన చికెన్ దుకాణం యజమాని

- ఏడాదిన్నరలో రెండు
- గతంలో చికెన్ షాప్ యాజమాని
- తాజాగా సెక్యూరిటీ గార్డ్
- ఇతర రాష్ట్రాల వారే నిందితులు

గజ్వేల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గజ్వేల్ డివిజన్ పరిధిలో హత్యలు కలకలం రేపుతున్నాయి. బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీల్లో కొందరు హత్యలకు తెగబడటం ఆందోళన కలిగిస్తోంది. డబ్బుల కోసమే.. ఇతర కారణాలు ఏమున్నాయో కానీ హత్యలతో పాటు కొందరు గంజాయి, మాదకద్రవ్యాల సరఫరాలోనూ కీలకంగా మారుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏడాదిన్నరలో రెండు హత్యలు జరగగా, అక్కడక్కడ పట్టుపడుతున్న గంజాయి అక్రమ రవాణాలోనూ ఎక్కువ మంది ఇతర రాష్ట్రాల వారే ఉంటున్నట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి.

గతేదాది జగదేవ్‌పూర్‌లో..

గతేదాది ఏప్రిల్ 21న జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని రాంరెడ్డి చికెన్ సెంటర్‌ను నిర్వహిస్తున్న మహిపాల్‌రెడ్డిని దుకాణంలో పనిచేసే పశ్చిమ బంగాకు చెందిన ఇద్దరు చంపేసి, దుకాణంలో ఉన్న డబ్బులను ఎత్తుకు వెళ్లి పోలీసులకు దొరికిపోయారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని వీ-మార్ట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఆడెపు బాలయ్య తోటి సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న బీహార్‌కు చెందిన వ్యక్తులు హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆడెపు బాలయ్య చనిపోయిన అనంతరం ఆయనతో కలసి సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న వ్యక్తులు అదృశ్యమవడం అనుమానాలకు తావిస్తుందని పోలీసులు భావిస్తున్నారు.

ఇతర రాష్ట్రాల కూలీల డేటా ఎక్కడ...?

ఉపాధి కోసం పలు రాష్ట్రాల నుంచి జిల్లాకు పెద్ద సంఖ్యలో కూలీలు, ఇతర పనులు చేసేవారు వస్తున్నారు. అయితే, వారికి సంబంధించి ఎలాంటి డేటా ఎవరూ సేకరించడం లేదు. రోజూ వందల సంఖ్యలో వీరు వస్తున్నా.. కనీస సమాచారం కూడా ఎవరూ సేకరించడం లేదు. ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలను టేకేదార్లుగా అవతారమెత్తిన పలువురు తీసుకువచ్చి ఇక్కడ పనుల్లో పెడుతుండగా, మరికొంత మంది ఉపాధి వెతుక్కుంటూ ఇక్కడకు వస్తున్నారు. స్థానిక కూలీలకంటే తక్కువ రేటుకు వీరు పనులు చేయడంతో పాటు పనులు బాగా చేస్తారన్న నమ్మకంతో ఇక్కడ అవసరం ఉన్నవారు ఇతర రాష్ట్రాల కూలీలపైనే ఆధారపడుతున్నారు. ఎవరు ఎటువంటి వారో అర్థం కాకుండా పోతుంది. ఇలా వచ్చిన వారిలో కొంతమంది కొందరు నేరాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇది ఇతర రాష్ట్రాలకు చెంది.. సజావుగా, నిజాయితీగా పనిచేసే వారికి ఇబ్బందిగా మారుతోంది. ఈ నేపథ్యంలో వలస కూలీల డేటాను సేకరించాలని, పనిలో పెట్టుకునే వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసేవిధంగా చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.


హత్యకు గురైన సెక్యూరిటీ గార్డు

వివరాలను సేకరించాలి



ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీల వివరాలను తప్పనిసరిగా సేకరించాలి. వారి ఆధార్ కార్డు, కుటుంబవివరాలు, నేపథ్యం తెలుసుకోవాలి. పనిలో పెట్టుకునే వారు తప్పనిసరిగా వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో/యూనియన్ కార్యాలయంలో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇతర రాష్ట్రాల కూలీలు ఏం చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి. అందులో కొందరు చోరీలు, గంజాయి విక్రయాలకు పాల్పడే అవకాశం ఉంది. హత్యలు చేస్తుండటంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అధికార యంత్రాంగం ఈ విషయంలో చొరవ చూపాలి.

\- బారు అరవింద్, బీజేపీ నాయకులు, గజ్వేల్

సెక్యూరిటీ గార్డ్ దారుణహత్య


బాలయ్య(ఫైల్)

గజ్వేల్ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని వీ మార్ట్ స్టోర్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న ఆడెపు బాలయ్య (40) మంగళవారం తెల్లవారుజామున దారుణ హత్యకు గురయ్యాడు. పట్టణంలోని బీడీ కాలనీలో నివసిస్తున్న బాలయ్యకు భార్య పుష్ప, నలుగురు కుమార్తెలు ఉన్నారు. బాలయ్య వీమార్ట్‌లో ఐదేళ్లుగా సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి 6 గంటలకు డ్యూటీకి వచ్చిన బాలయ్య మంగళవారం ఉదయం తిరిగి ఇంటికి రాలేదు. హత్య విషయం తెలియగానే పోలీసులు వచ్చి దర్యాప్తు ప్రారంభించారు. డాగ్ స్క్వాడ్‌తో క్లూస్ టీం ఆధారాలు సేకరిస్తున్నారు. అయితే, బాలయ్య హత్యకు గురై పడి ఉన్నాడని తెలియగానే కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అయితే, బీహార్‌లోని భోజ్పూర్ జిల్లాకు చెందిన రితేష్‌రాయి (27), రంజిత్‌రాయి (27) సైతం వీమార్ట్ ప్రారంభం నుంచి సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్నారు. తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతంలో బాలయ్య హత్యకు గురి కాగా, అప్పటి నుంచి వారు అదృశ్యమయ్యారు. అయితే, బీహార్‌కు చెందిన సెక్యూరిటీ గార్డులే బాలయ్య గొంతునులిమి హత్య చేసి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు గల కారణాలను పోలీసులు అన్వేషిస్తున్నారు.

గుంతల రోడ్డుతో అవస్థలు


అశోక్ షెట్కార్ కాంప్లెక్స్ ఎదుట రోడ్డుపై గుంత

నారాయణఖేడ్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణంలోని ప్రధాన రోడ్డుపై పలుచోట్ల గోతులు ఏర్పడడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. మంగల్‌పేట నుంచి బసవేశ్వర చౌక్, శివాజీ చౌక్ వరకు గోతులు ఏర్పడ్డాయని, దీంతో రాత్రి సమయంలో వాహనాలు ప్రమాదాల బారినపడుతున్నామని తెలిపారు. అధికారులు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆర్‌ఎంపీపై విచారణ


ఆర్‌ఎంపీ నుంచి మందులు స్వాధీనం చేసుకుంటున్న వైద్యాధికారి

మద్దూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో ఆర్‌ఎంపీగా కొనసాగుతున్న పూర్ణచందర్‌పై కలెక్టర్, డీఎంహెచ్‌వో ఆదేశాలతో పోలీసుల సహాయంతో లద్నూరు వైద్యాధికారి అర్జున్‌రాజ్ మద్దూరు వైద్యాధికారి మహేందర్‌తో కలిసి తహసీల్దార్ రహీం, ఎంపీడీవో రామ్మోహన్, ఎంపీవో వెంకటేశ్వర్లు సమక్షంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యమందిస్తున్న రూంతో పాటు ఇంట్లో సోదాలు చేసి పూర్ణచందర్ నుంచి సిరంజీలు, స్టెరాయిడ్స్ బుడ్డీలు, పెయిన్ కిల్లర్స్ యాంటీ బయాటిక్ ఒదులను స్వాధీనం చేసుకున్నట్లు వైద్యాధికారి అర్జున్‌రాజ్ తెలిపారు. విచారణ సమయంలో ఓ మహిళకు ఇంజక్షన్ చేస్తున్నాడని తెలిపారు. విచారించగా వైద్యులు రాసి ఇచ్చిన ప్రిస్కిప్షన్‌పై ఐరన్ ఇంజక్షన్స్ పెడుతున్నట్లు పూర్ణచందర్ ఒప్పుకున్నట్లు తెలిపారు. తనలాగా మండలంలో 33 మంది అనుమతులు లేకుండా ఆర్‌ఎంపీగా ప్రాక్టీస్ చేస్తున్నట్లు సమాచారం ఇచ్చారు. గ్రామానికి చెందిన యాదమ్మ కరోనా సమయంలో కొడుకు రాజుకు ట్రీట్‌మెంట్ చేసి మృతికి కారకుడయ్యాడని తెలిపిందన్నారు. డీఎంహెచ్‌వోకు పోలీసులు చేసిన ఫిర్యాదు మేరకు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టి నివేదికను డీఎంహెచ్‌వోకు అందించినట్లు తెలిపారు. అనంతరం పూర్ణచందర్‌ను స్టేషన్‌కు తరలించారు.

రంజోల్‌లో వివాహిత అదృశ్యం

జహీరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యమైన సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని రంజోల్‌లో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన క్రిస్టీనా(21) హైదరాబాద్‌లో నర్సింగ్ కోర్సును చదువుతున్నది. నెలరోజుల క్రితం హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వచ్చింది. ఈనెల 26న అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త అలిగి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని జహీరాబాద్ రూరల్ ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపారు. వివరాలు తెలిసిన వారు 872661847, 8712656764, 872656731 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారమందించాలన్నారు.

గౌరారంలో యువకుడు..

వర్గల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : యువకుడు అదృశ్యమైన సంఘటన వర్గల్ మండలం గౌరారం గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రావనిఇకి చెందిన నరాని సాయికుమార్(24) సోమవారం మధ్యాహ్నం ఇంట్లోంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కరుణాకర్ రెడ్డి తెలిపారు.

ఇంట్లోకి చొరబడి...తుపాకీతో బెదిరించి..

అగంతుకులను పట్టుకున్న గ్రామస్తులు

మిరుదొడ్డి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మంకీ క్యాపులను ధరించి ఇంట్లోకి చొరబడిన ఇద్దరు అగంతుకులు తుపాకీతో బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారు. వారిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలో మంగళవారం రాత్రి ఈ ఘటన కలకలం చోటుచేసుకుంది.. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ లక్ష్మీనర్సయ్య ఇంట్లోకి మంగళవారం రాత్రి ఇద్దరు అగంతకులు చొరబడి తుపాకీతో బెదిరించడంతో కుటుంబసభ్యులు అరుపులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. దీంతో ఇద్దరు అగంతకులు పారిపోతుండగా, గ్రామస్తులు వారిని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న దుబ్బాక సీఐ శ్రీనివాస్, మిరుదొడ్డి ఎస్‌ఐ సమతాలు విచారణ చేపట్టారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం

ఝరాసంగం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని తహసీల్దార్ తిరుమలరావు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.

చెరువులో పడి వ్యక్తి ఆత్మహత్య

నర్సాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చెరువులో పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నర్సాపూర్ పట్టణానికి చెందిన రమేష్(38) మాంసం విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ముగ్గురు కుమారులు. మూడో కుమారుడు రమేష్‌కు ఈ మధ్యనే పెళ్లి కుదిరింది. పెళ్లికి కావాల్సిన డబ్బుల కోసం తండ్రి ఎంత ప్రయత్నం చేసినా లభించలేదు. దీంతో మదనపడిన రమేష్ సోమవారం బయటకు వెళ్లి రాత్రయినా రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా మంగళవారం ఉదయం సమీపంలోని రాయరావు చెరువులో అక్కడ పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందికి మృతదేహం కనిపించింది. వారు వచ్చి చూసి రమేష్‌గా గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

అల్లాదుర్గం, అక్టోంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెరువులో పడి గల్లంతైన వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైనట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురానికి చెందిన ఎన్.నాగచారి(35) మండలంలోని రాంపూర్ శివారులోని దుబ్బచెరువులో ఈ నెల 27న పడ్డాడు. గజ ఈతగాళ్లతో గాలించగా మంగళవారం మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడు నాగచారి మూడునెలలుగా మతి స్థిమితం కోల్పోయాడు. పలు ప్రాంతాల్లో సంచరిస్తూ సోమవారం రాంపూర్ చెరువు వద్దకు వెళ్లి తన భార్య శైలజకు వీడియో కాల్‌చేసి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్‌ఐ వివరించారు. మృతుడి భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు.

పాము కాటుతో ఎద్దు మృతి

కంగ్టి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో ఎద్దు మంగళవారం మృతిచెందింది. మండల పరిధిలోని నాగూర్.కే గ్రామానికి చెందిన తుకారాం రోజు మాదిరిగా తన ఎద్దును మేత కోసం పొలానికి తీసుకెళ్లాడు. ఎద్దు మేస్తున్న క్రమంలో పాము కాటు వేయడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు. కాగా పశు వైద్యాధికారి ముస్తాక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్

చిన్నశంకరంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండలం అంబాజీపేట గ్రామంలో మట్టి అక్రమంగా తరలిస్తున్న రెడు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు. గ్రామంలోని ఇటుక బట్టీలకు అనుమతులు లేకుండా ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రెండు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి, ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేశారు. అక్రమ దందాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్‌ఐ హెచ్చరించారు.

'నువ్వొక్కడివే ఎందుకు.. నేను కూడా చస్తా'

- ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగు మందు తాగిన తండ్రి
- అది చూసి కొడుకూ ఆత్మహత్యాయత్నం
- తండ్రి మృతి, కుమారుడి పరిస్థితి విషమం


సయ్యద్ ఆరిఫ్(ఫైల్)


నర్సాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణకు ఆరోగ్యం సహకరించక, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి తన కుటుంబసభ్యుల ఎదుటే పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అది చూసిన అతని కుమారుడు.. నువ్వొక్కడివే చావడం ఎందుకు? నేను కూడా చస్తానంటూ.. క్షణికావేశంలో పురుగు మందు తాగేశాడు. ఈ ఘటనలో తండ్రి కోల్పోగా.. కుమారుడి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నర్సాపూర్‌లోని ఎన్‌జీవో కాలనీకి చెందిన సయ్యద్ ఆరిఫ్(48) డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆరిఫ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురైన ఆరిఫ్ మూడునెలలుగా పనికి దూరమై ఇంటికే పరిమితమయ్యాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోగా తీవ్ర మనస్తాపానికి గురైన ఆరిఫ్ కొద్దిరోజులుగా తన భార్య వద్ద తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. అక్టోబరు 26న బయటకు వెళ్లి ఇంటికి తిరిగొచ్చిన ఆరిఫ్.. కుటుంబసభ్యులకు ఓ సీసాను చూపించి పురుగు మందు తాగానని, చనిపోతున్నానని చెప్పాడు. తమను బెదిరించడానికే తండ్రి ఇలా చేస్తున్నాడు అనుకొని.. ఆరిఫ్ చిన్న కుమారుడు, సయ్యద్(18) నువ్వొక్కడివే చావడం ఎందుకు నేనూ చస్తానంటూ.. తండ్రి చేతిలోని సీసాను లాక్కొని అందులోని పురుగు మందు తాగాడు. ఆపై, అస్వస్థతకు గురైన తండ్రీకొడుకులను కుటుంబ సభ్యులు హుటాహుటిన నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి సంగారెడ్డి ఆస్పత్రికి, తర్వాత హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆరిఫ్ మంగళవారం మరణించగా.. ఇంటర్ విద్యార్థి అయిన సయ్యద్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. ఇతను అదే ఆస్పత్రిలో ఉన్నాడు. ఆరిఫ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


అల్లీనగర్ బందంకుంటలో భారీగా చేరిన పరిశ్రమల విష రసాయనాలు

కంపుకొడుతున్నాయి..

- చెరువులు.. కుంటల్లోకి రసాయన జలాలు
- యథేచ్ఛగా విడుదల చేస్తున్న కొన్ని పరిశ్రమలు

జిన్నారం, అక్టోబరు, 28 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండల పారిశ్రామిక వాడల్లో నియంత్రణ లేని పరిశ్రమలతో జల వనరులు కలుషితం అవుతున్నాయి. ఏరులై పారుతున్న పరిశ్రమల రసాయనాల ప్రవాహంతో సమీపంలోని చెరువులు, కుంటలు కాలుష్య జలాలతో నిండిపోతున్నాయి. దశాబ్దాలుగా ఈ సమస్య పట్టి పీడిస్తున్నా పరిష్కారం చూపే నాథుడే కనిపించడం లేదు. జిన్నారం మండలం గడ్డపోతారం, కాజీపల్లి, బొల్లారం ప్రాంత పరిధిలోని పలు రసాయన పరిశ్రమలు గుట్టుచప్పుడు కాకుండా రసాయన కాలుష్యాన్ని వదిలేస్తున్నాయి. వాస్తవానికి పరిశ్రమల నుంచి వెలువడి వ్యర్థ, రసాయన కాలుష్యజలాలను దూరంగా తరలించాల్సి ఉంటుంది. కానీ, కొందరు డబ్బులు మిగుల్చుకునేందుకు వాటిని బయటికి వదిలేస్తుండంతో చెరువులు, కుంటల్లోని జలాలు కలుషితమవుతున్నాయి. అలాగే, రసాయన జలాలు భూమిలో ఇంకి భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయి. మండలంలో అల్లీనగర్ శివారులోని బందం కుంట, కాజీపల్లి జిల్లెలవాగు, గండిచెరువు, గడ్డపోతారం అయ్యమ్మ చెరువులో భారీ స్థాయిలో రసాయన వ్యర్థాలు చేరి కంపుకొడుతున్నాయి. ఇటీవలే పీసీబీ అధికారులు వాయు కాలుష్యాన్ని నియంత్రించాలని పారిశ్రామిక వేత్తలతో సమావేశం నిర్వహించి, హెచ్చరికలు జారీ చేసినా వాటిని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీసీబీ అధికారులు స్పందించి రసాయిన, కాలుష్య జలాలను విడుదల చేస్తున్న పరిశ్రమలు, కర్మాగారాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


కాజీపల్లి జిల్లెలవాగులో ప్రవహిస్తున్న వ్యర్థ రసాయనాలు


రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

గౌరవెల్లి ఉపకాలువ సర్వేను అడ్డుకున్న రైతులు

- రోడ్డుపై బైఠాయించి ఆందోళన

హుస్నాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ శివారులో చేపట్టిన గౌరవెల్లి రిజర్వాయర్ ఉపకాలువ సర్వేను మంగళవారం రైతులు అడ్డుకున్నారు. ఉప కాలువ నిర్మాణానికి తమ భూములు ఇవ్వమని హుస్నాబాద్ శివారు ప్రాంతాలకు చెందిన రైతులు పురుగుల మందు డబ్బాతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. గతంలో డీ-4 కెనాల్ నిర్మాణంలో భూములు కోల్పోయామని, మళ్లీ ఇప్పుడు ఉప కాలువ నిర్మాణంతో ఉన్న భూములను కూడా కోల్పోతే తాము ఎలా బతకాలని ప్రశ్నించారు. ఈ కాలువ నిర్మాణాన్ని వేరే చోట డిజైన్ చేసి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇందులో భూములు కోల్పోతున్న వారందరు చిన్న సన్నకారు రైతులని, ప్రాణం పోయినా భూములు ఇచ్చే ప్రసక్తి లేదని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి, కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, మేకల వికాస్‌తోపాటు రైతులు పాల్గొన్నారు.

భాషోపాధ్యాయులు షరీఫ్‌కు పురస్కారం


మహ్మద్ షరీఫ్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డికి చెందిన ప్రముఖ కవి, భాషోపాధ్యాయులు, తెలంగాణ తెలుగు పాఠ్యపుస్తక రచయిత మహ్మద్ షరీఫ్‌కు 'నీరాజనం' ఖండకావ్యానికి పెండోట పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ సంవత్సరం సిద్దిపేటకు చెందిన శ్రీవాణి సాహిత్య పరిషత్ వారి పద్య విభాగంలో మహ్మద్ షరీఫ్ రచించిన ఖండకావ్యానికి పురస్కారం లభించడం అభినందనీయమని సాహిత్య రంజని సాహితీ కళా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పెంటారెడ్డి, బాబురావు, శ్రీపాదబాలాజీ, సాయిలుచారీ, పూర్ణకృష్ణ, రవి, బస్వప్ప, కొండాపూర్ లక్ష్మీలు అభినందనలు తెలియజేశారు. వచ్చే నెలలో పురస్కారాన్ని అందుకోనున్నట్టు షరీఫ్ తెలిపారు

సస్తా మాల్


వెల్దుర్తిలో విక్రయిస్తున్న కూరగాయలు

- పిన్నీసు నుంచి పెళ్లి సామగ్రి వరకు
- అగ్గువకే అన్ని వస్తువులు
- వారంతపు సంతలకు తగ్గని క్రేజ్
- సూపర్ మార్కెట్లను తలపిస్తున్న అంగళ్లు

వెల్దుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పిన్నీసు నుంచి పెళ్లి సామగ్రి వరకు.. అన్ని వస్తువులు అగ్గువకే.. పట్టణాలకు వెళ్లాల్సిన పనిలేదు.. దుకాణాల చుట్టూ తిరిగి వెతకాల్సిన అవసరం లేదు.. కావాల్సినవన్నీ ఊళ్లోకే తెచ్చే వేదికలు.. పల్లె ప్రజల సూపర్‌మార్కెట్లు.. వారంతపు సంతలు. అందుకే కంప్యూటర్ యుగంలోనూ అంగడికి క్రేజ్ తగ్గడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో వారానికోసారి నిర్వహించే అంగడికి క్రేజ్ తగ్గడం లేదు. రైతులు తమ పొలాల్లో పండించే కూరగాయలను, వ్యాపారులు తాము విక్రయించే వస్తువులను హోల్‌సేల్‌లో తెచ్చుకొని సరసమైన ధరలకు గ్రామాల్లో నిర్వహించే అంగళ్లలో విక్రయించడంతో అంగళ్లకు పేదోడి మార్కెట్‌గా నిలుస్తున్నాయి. నగరాల్లోని సూపర్ మార్కెట్లలో నిర్వహణ ఖర్చులు, ట్యాక్స్‌లు, సర్వీస్ చార్జీల పేరిట జేబులు గుల్లవుతాయి. కానీ, అంగళ్లలో వారం రోజులకు అవసరమయ్యే నిత్యావసరాలతో పాటు అన్నిరకాల వస్తువులు తక్కువ ధరకే దొరుకుతాయి.


అంగడిలో విక్రయిస్తున్న ప్లాస్టిక్ సామాను, దుస్తులు

తాజా సరుకులు

పట్టణాల్లోని సూపర్ మార్కెట్లలో నిల్వ చేసిన కూరగాయలు, వస్తువులు, తినుబండారాలు విక్రయిస్తే.. పల్లెల్లో నిర్వహించే అంగళ్లలో రైతులు పొలాల్లో పండించిన తాజా కూరగాయలు, పళ్లు, అప్పటికప్పుడే తయారుచేసే తినుబండారాలు తాజా అందజేస్తారు. వీటితో పాటు పట్టణాల్లోని దుకాణాల్లో విక్రయించే దుస్తులు, ఇళ్లలో వినియోగించే వంట సామాగ్రి, పాత్రలు, మహిళలకు, చిన్నారులకు అలంకరణ వస్తువులు, ప్లాస్టిక్ వస్తువులు అందుబాటులో ఉంటాయి. తాంబూలం వేసుకునే తమలపాకులతో మొదలు కొని వివాహాలు, విందుల్లోకి అవసరమయ్యే మసాలాలు, సామాన్యుల ఇంట్లో పెళ్లిలు, శుభకార్యాలకు అవసరమయ్యే అన్ని వస్తువులు సరసమైన ధరలకు దొరకడంతో నేటికి అంగళ్లను ఈతరం ప్రజలు మర్చిపోవడం లేదు.

అంగడే జీవనాధారం



ఇంటర్ చదివినా స్వయం ఉపాధి కోసం 18 సంవత్సరాలుగా వారాంతపు సంతల్లో సీజనల్ వ్యాపారం చేస్తున్నాను.ఆధునిక యుగంలోనూ గ్రామీణ ప్రాంతాల్లో అంగళ్లకు ఆదరణ తగ్గలేదు. ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి నచ్చిన సరుకులను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికీ మాలాంటి వ్యాపారులకు చేతినిండా పని దొరుకుతుంది.

\- హరీశ్ వ్యాపారి, తూప్రాన్

అన్ని వస్తువులు దొరుకుతాయి



వెల్దుర్తిలో జరిగే శనివారం అంగడిలో ప్రతీ వస్తువు దొరుకుతుంది. ఏ వస్తువైనా దుకాణాల కంటే అంగడిలోనే తక్కువ ధరకు దొరుకుతున్నాయి. సంత లేనప్పుడు అవే వస్తువులు దుకాణాల్లో అడిగితే రెండితల ధరలు చెబుతారు. అంగడితో పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థికంగా మేలు జరుగుతుంది.

\- ఆగమయ్య, వెల్దుర్తి



అంగడిలో విక్రయిస్తున్న దుస్తులు

వెల్దుర్తి మండలంలో..

మండల కేంద్రమైన వెల్దుర్తిలో శనివారం నిర్వహించే అంగడికి మండలంతో పాటు చుట్టుపక్కల మండలాలైన శివ్వంపేట, చేగుంట, చిన్నశంకరంపేట, తూప్రాన్, కౌడిపల్లి, కొల్చారం మండలాలకు చెందిన ప్రజలు తరలివస్తారు. అంగడి రోజు కూరగాయాలు, వస్తువులు తెచ్చుకోకపోతే అవే వస్తువులను దుకాణాల్లో రెట్టింపు ధరలకు కొనాల్సివస్తుంది. అందుకే మండలంలో ప్రజలు వారం రోజులకే అవసరమయ్యే సరుకుల కోసం శనివారం అంగడికి తరలివస్తారు. ఆ రోజు వేలాది మందితో వెల్దుర్తి పట్టణం కిక్కిరిసిపోతుంది.

వైభవంగా అష్టలక్ష్మి మహా సుదర్శనయాగం


పూర్ణాహుతి నిర్వహిస్తున్న పురోహితులు

నారాయణఖేడ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలోని జంట గ్రామమైన మంగల్‌పేటలో అష్టలక్ష్మి మహా సుదర్శన యాగంతో పాటు సామూహిక రమాసహిత సత్యనారాయణ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. దుర్గామాత ఆలయ ప్రాంగణం, మా ఫంక్షన్ హాల్‌లో మంగళవారం లలితా వైభవం ట్రస్టు తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ట్రస్టు వ్యవస్థాపకులు మలమంచి మోహన జ్యోషి ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం అష్టలక్ష్మి ఉత్సవ విగ్రహాలను ఊరేగించడమే కాకుండా ప్రత్యేక పూజలు, అలంకరణ, హారతి కార్యక్రమాల అనంతరం అష్టలక్ష్మి మహా సుదర్శన యాగాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం దాదాపు 300 మంది దంపతులు సామూహికంగా శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పురోహితులు మనోజ్‌జ్యోషి, గుడి చంద్రశేఖర్, చంద్రశేఖర్ పంతులు, చిన్ని మధుకర్, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్ సతీమణి ఉమా షెట్కార్, ఎమ్మెల్యే సతీమణి అనుపమ్మరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, తదితరులు పాల్గొన్నారు.

దీపారాధనతో శుభ పరిణామాలు

- మాధవానంద సరస్వతీ స్వామి


మాధవానంద సరస్వతీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

నారాయణఖేడ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో శివకేశవులను స్మరించుకుంటూ దీపారాధన చేయడం వల్ల శుభ పరిణామాలు జరుగుతాయని రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. కార్తీక మాసంలో మూడవ సోమవారాన్ని పురస్కరించుకొని నవంబరు 10న ఖేడ్ భక్త మార్కండేయ ఆలయంలో నిర్వహించనున్న కార్తీక దీపోత్సవం, తులసీదామోదర, శివ పార్వతుల కల్యాణ మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను మంగళవారం స్థానిక మహతి జ్యోతిష్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్తీక మాసం శివుడికి అత్యంత ప్రీతి పాత్రమైందన్నారు. జ్యోతిష్యాలయ నిర్వాహకులు, అర్చకులు బ్రహ్మశ్రీ గురురాజ శర్మ, భక్తులు స్వామి వారిని దర్శించుకొని ఆశీస్సులు పొందారు.


నాచగిరిలో దీపారాధన చేస్తున్న భక్తులు

నాచగిరి క్షేత్రంలో కార్తీక దీపారాధన

వర్గల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) :నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో మంగళవారం భక్తులు కార్తీక దీపారాధన చేశారు. నిత్యం వివిధ రకాల ఆకృతులతో దీపారాధన చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్త, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామరావు పర్యవేక్షణలో దీపారాధన నిర్వహిస్తున్నారు. క్షేత్రానికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు అందుకు తగిన చర్యలు తీసుకున్నారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు

రామచంద్రాపురం టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పుణ్యక్షేత్రాల దర్శనానికి ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నామని రామచంద్రాపురం బెల్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుధ చెప్పారు. ధర్మపురి, కొండగట్టు, కోటిలింగాలు, కొమరవెల్లి, మంత్రాలయం, మన్నెంకొండ, కురుమూర్తి, బీచ్పల్లిహనుమాన్ ఆలయం, కాళేశ్వరం, రామప్పఆలయం, భద్రకాళి ఆలయం, వేయి స్థంభాల గుడి, యాదగిరి గుట్ట, స్వర్ణగిరి, పంచరామాలు, అన్నవరం ఆలయాల సందర్శనకు బస్సు సౌకర్యం ఉంటుందని వివరించారు. తిరుపతి, చెన్నై, విశాఖపట్నం, అమలాపురం, కాకినాడ, శ్రీశైలం, గుంటూరు, చీరాల, గుడివాడ, తెనాలి, మచిలీపట్నం, విజయవాడ ప్రాంతాలకు వెళ్లడానికి సూపర్‌లగ్జరీ, రాజధాని, లహరి బస్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. కాణిపాకం, గోల్డెన్‌టెంపుల్, కంచి, అరుణాచలంకు ప్రయాణం చేయాలనుకునే వారు 93910 72283, 90634 01072 నంబర్లకు ఫోన్ చేసి టికెట్లు బుక్ చేసుకోవచ్చని ఆమె చెప్పారు.

మంజీర ఫ్యూచర్ సిటీ సాధనకు ఉద్యమం



మంజీర నది వద్ద ప్రదర్శన నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

పుల్‌కల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మంజీర నది కారిడార్-5వ ఫ్యూచర్ సిటీ సాధన ఉద్యమానికి బీజేపీ శ్రీకారం చుట్టింది. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ నాయకులు సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం వెండికోలు, లింగంపల్లి గ్రామ శివారు ప్రాంతాల్లోని మంజీర నది వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడ ప్రవహిస్తున్న మంజీర నది ఈ ప్రాంత ప్రజలకు జీవనాధారమని బీజేపీ సీనియర్ నాయకుడు పల్వట్ల జగదీశ్వర్ పాటిల్ తెలిపారు. మహోన్నతమైన మంజీర నది తీర ప్రాంత అభివృద్ధి, పర్యావరణ సంరక్షణ, పర్యాటక రంగంగా ప్రోత్సహించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. 'మంజీర రివర్ కారిడార్-5వ ఫ్యూచర్ సిటీ' పేరుతో స్ఫూర్తిదాయక ప్రజాఉద్యమాన్ని చేపడుతున్నామన్నారు. ఇందు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలోని మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు వినతిపత్రం అందజేయనున్నామని జగదీశ్వర్ తెలిపారు. ప్రజలను భాగస్వాములను చేసి ఈ ఉద్యమాన్ని బలోపేతం చేస్తామన్నారు. మంజీర మనకు గర్వకారణమని, దాని పరిరక్షణ, అభివృద్ధి మనందరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు నీరుడి ప్రవీణ్‌ముదిరాజ్, ప్రవీన్‌రెడ్డి, నాయకులు గంగా జోగినాథ్, మఠం చంద్రశేఖర్, చంటి ప్రభు, దేవిక, రమేశ్‌బస్వరాజ్, మహేశ్, గాండ్ల శ్రీనివాస్, సార రాజ్‌కుమార్, చందాపురం ముకుందంముదిరాజ్, చాకలి రాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు.. నిర్వహణ మరిచారు

- మల్కాపూర్‌లో నర్సరీలో వర్షపు నీరే దిక్కు..
- అధ్వానంగా పల్లెప్రకృతి వనం


మల్కాపూర్‌లోని పల్లె ప్రకృతి వనంలో పేరుకుపోయిన చెత్త

తూప్రాన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఘనంగా ఏర్పాటు చేసిన పథకాలను అధికారులు పట్టించుకోవడంలేదు. నాటిన మొక్కలు గాలికి వదిలేసి చేతులు దులుపుకుంటున్నారు. నర్సరీలలో మొక్కలకు నీరు పెట్టడం మరిచిపోవడంతో వర్షపు నీరే దిక్కయింది. పల్లె ప్రకృతి వనంలో నాటిన చెట్లకు నీరందించకపోగా, నిర్వహణ కూడా మరిచిపోయారు. నర్సరీలో మొక్కలు నీరులేక వాడిపోతున్నాయి. ఈ ఘటన రాష్ట్రంలో ఆదర్శ గ్రామంగా పేరు తెచ్చుకున్న మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మల్కాపూర్ గ్రామం రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా నిలిచిపోయింది. గత ప్రభుత్వ హయాంలో గుర్తింపు పొంది వివిధ రాష్ట్రాల నుంచి ప్రజా ప్రతినిధులు.. అధికారులు సందర్శించారు. మల్కాపూర్ గ్రామానికి అందమైన పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసి నిర్వహణకు గ్రామ పంచాయతీలకు అప్పగించారు. కానీ గ్రామ పంచాయతీగానీ, గ్రామ యువత గానీ పల్లె ప్రకృతి వనం వైపు కన్నెత్తి చూడటక పోవడంతో పల్లె ప్రకృతి వనం కేంద్రాలు కళావిహీనంగా తయారయ్యాయి. చెట్ల ఆకులు రాలిపోయి చెత్త చెదారం నిండిపోయింది. అలాగే వన మహోత్సవం నిర్వహించేందుకు గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీ నిర్వహణ సైతం గాలికి వదిలేశారు. మొక్కలకు నీరు పెట్టడమే మరిచిపోయారు. ఇటీవల కురిసిన వర్షాలే నర్సరీకి దిక్కయ్యాయి. అధికారులు స్పందించి పల్లె ప్రకృతివనం, నర్సరీల నిర్వహణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


నర్సరీ దుస్థితి

న్యూస్ బాక్స్

ఇందిరమ్మ నిర్మాణాలు పరిశీలన

పెద్దశంకరంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట మండల పరిధిలోని కోలపల్లిలో ఇందిరమ్మ గృహ నిర్మాణాలను పేట ఎంపీడీవో షాకీర్‌అలీ మంగళవారం పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. వీలైనంత తొందరగా నిర్మాణాలను పూర్తిచేసుకోవాలని సూచించారు. కోలపల్లి గ్రామానికి 20 ఇందిరమ్మ గృహాలు మంజూరు కాగా.. 16 ఇళ్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శి గీత, రైతులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు సద్వినియోగం చేసుకోవాలి

పెద్దశంకరంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని పెద్దశంకరంపేట ఈజీఎస్ ఏపీవో సంతోష్‌కుమార్ అన్నారు. మంగళవారం పేట మండల పరిధిలోని ఆరేపల్లిలో గ్రామసభ ఏర్పాటుచేసి ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనుల గురించి చర్చించారు. పలు పనులకు సంబంధించి తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ సిబ్బంది నవాజుద్దీన్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

మెదక్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట పట్టణంలోని కేసీఆర్ కాలనీలో ఏర్పాటైన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత్‌రావు తోపాటు కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు కట్ట ప్రభాకర్ మంగళవారం శిబిరాన్ని ప్రారంభించారు. ఆర్‌వీఎం ఆస్పత్రి వైద్యులు 215 మంది రోగులను పరీక్షించారు. గుండెకు సంబంధించిన ఈసీజీ, బీపీ పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో డాక్టర్లు వినోద, రమ్య, లిఖిత, శ్రేయాస్, పావన పాల్గొన్నారు.

4న యువజనోత్సవాలు, సైన్స్ మేళా

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నవంబరు 4న జిల్లా యువజనోత్సవాలు, సైన్స్ మేళా నిర్వహించనున్నట్టు డీవైఎస్‌వో ఖాసీంబేగ్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు యువజనోత్సవాలు ఉంటాయని పేర్కొన్నారు. వివిధ అంశాల్లో పాల్గొనాలనుకునే యువతి యువకులు కలెక్టరేట్ రెండో అంతస్తులోని డీవైఎస్‌వో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. వివరాలకు 7386191141, 8431639907 నంబరు సంప్రదించాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ

కంగ్టి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తుర్కవడగాం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో సత్తయ్య మంగళవారం తనిఖీ చేశారు. పిల్లలకు, మహిళలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్ నిర్మలను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు.

నిజాయితీగా విధులు నిర్వర్తించాలి : తహసీల్దార్

చిన్నశంకరంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఉద్యోగి నిజాయితీగా విధులను నిర్వర్తించాలని తహసీల్దార్ మాలతి అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందికి విజిలెన్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. విధుల పట్ల పలు సూచనలు చేసి మాట్లాడారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

ఘనంగా సదర్

జిన్నారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం పరిధిలోని పెద్దమ్మగూడెం గ్రామానికి చెందిన యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, నాయకులు పాల్గొన్నారు.

పాడుబడ్డ బావులు మూసేయించాలి

నారాయణఖేడ్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ నియోజకవర్గంలో పలుచోట్ల ప్రమాదకరంగా, పాడుబడ్డ బావులను మూసేయించాలని పలు సంఘాల బాధ్యులు సబ్ కలెక్టర్ ఉమాహారతికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఇందులో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు, ఇతర సంఘాల నాయకులు ఉన్నారు.

గోమాతను పూజించాలి

రేగోడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతిరోజు గోమాతను పూజించుకోవాలని హైదరాబాద్ ఇస్కాన్ టెంపుల్ హరే కృష్ణ హరే రామ సంస్థాన్ బాధ్యులు గోపాల్ దాస్ ప్రభు, కేశవ్‌దాస్, జననేత ప్రభు అన్నారు. సోమవారం రాత్రి రేగోడు మండలంలోని మక్త వెంకటాపురంలో హరేకృష్ణ హరేరామ ప్రభాతభేరి, కీర్తనలు, ప్రవచనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వట్‌పల్లి మార్కెట్ కమిటీ ట్రేడ్ డైరెక్టర్ శ్రీధర్‌గుప్తా, సంగమేశ్వర్, ఇస్కాన్ టెంపుల్ బాధ్యులు, ముస్లాపూర్ కృష్ణాలయ బాధ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులకు రూ.1.30 కోట్ల నిధులివ్వండి

- కలెక్టర్‌ను కోరిన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ బాయ్స్ హైస్కూల్, జూనియర్ కళాశాలలో పెండింగ్ పనుల కోసం రూ.1.30 కోట్ల నిధులు ఇవ్వాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి కలెక్టర్ ప్రావీణ్యను కోరారు. కలెక్టరేట్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మూడురోజుల క్రితం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మలాజగ్గారెడ్డి హైస్కూల్, జూనియర్ కళాశాలపై సమీక్ష జరిపిన విషయం తెలిసిందే. బాయ్స్ హైస్కూల్, జూనియర్ కళాశాల మధ్యలో ప్రహరీ నిర్మాణం, గ్రావెల్ కోసం రూ.1.30 కోట్లు అవసరమవుతాయని అధికారులు వారి దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ ప్రావీణ్య సానుకూలంగా స్పందించి త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీఇచ్చినట్లు నిర్మలాజగ్గారెడ్డి తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు జూలకంటి ఆంజనేయులు, కూన సంతోష్, రాంరెడ్డి ఉన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించండి

సంగారెడ్డి నియోజకవర్గంలోని క్రైస్తవులకు శ్మశానవాటిక లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున వారికి ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని నిర్మలాజగ్గారెడ్డి కలెక్టర్ ప్రావీణ్యను కోరారు. నియోజకవర్గంలోని పలువురు పాస్టర్లు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జార్జ్‌తో కలిసి నిర్మలారెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం

సంగారెడ్డిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సదాశివపేటలోని మంజీత్ కాటన్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. పత్తి రైతులు దళారులకు తక్కువ ధరకు పత్తిని విక్రయించొద్దని, ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ఎల్లకొండ ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాకుల కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన్న పాల్గొన్నారు.

నేరరహిత సమాజాన్ని నిర్మిద్దాం



చేగుంట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్

చేగుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నేరరహిత సమాజాన్ని నిర్మిద్దామని మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ పేర్కొన్నారు. చేగుంట పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల సేవలు మరువలేనివని చెప్పారు. ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా సుమారు 91 మంది పోలీసులు అమరులయ్యారని గుర్తుచేశారు. అనంతరం తూప్రాన్ డీఎస్పీ మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు యువత ముందుకురావడం సంతోషమన్నారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట, తూప్రాన్ సీఐలు వెంకటరాజాగౌడ్, రంగ కృష్ణ, ఎస్‌ఐలు చైతన్యకుమార్‌రెడ్డి, సుభాష్‌గౌడ్, రాజు, శివానందం, సత్యనారాయణ, బిక్యానాయక్, వైద్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీరంగూడ గుట్టపై అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



ఆలయ నిర్మాణ మ్యాపులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

అమీన్‌పూర్/పటాన్‌చెరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : బీరంగూడ గుట్టపై భక్తుల కోరిక మేరకు అయ్యప్పస్వామి ఆలయాన్ని త్వరలోనే నిర్మిస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం మాజీ ప్రజాప్రతినిధులు, అయ్యప్ప భక్తులతో కలిసి ఆలయ నిర్మాణం చేపట్టే స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. గుట్టపై ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా సర్వాంగ సుందరంగా అయ్యప్పస్వామి ఆలయాన్ని నిర్మిస్తామన్నారు. గుట్టపైన ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం పక్కనే నిర్మాణం చేపట్టేందుకు భక్తుల సమక్షంలో నిర్ణయం తీసుకున్నామన్నారు. ఏటా వేలాదిమంది అయ్యప్పస్వామి దీక్ష చేపడుతున్నారని, వారి పూజలు, భిక్ష ఏర్పాట్లకు అనుకూలంగా ఉండేలా అన్ని వసతులతో కేరళ అయ్యప్ప ప్రధాన ఆలయ తాంత్రీ పూజారులతో సమాలోచన చేసి నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లేష్ పాల్గొన్నారు. అలాగే ఇంద్రేశం మున్సిపల్ రామేశ్వరంబండ గ్రామానికి చెందిన రఘు అనే వ్యక్తికి మంజూరైన రూ.2.5 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

సొంతంగా విద్యుత్ మరమ్మతులు చేపట్టొద్దు

- విద్యుత్‌శాఖ రూరల్ జోన్ సీఈ బాలస్వామి



నర్సాపూర్‌లో ప్రజాబాట నిర్వహిస్తున్న సీఈ, ఎస్‌ఈతో పాటు ఇతర అధికారులు

నర్సాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సమస్య వస్తే ప్రజలు సొంతంగా మరమ్మతులు చేసుకుని ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని విద్యుత్ శాఖ రూరల్ జోన్ ఎస్‌ఈ బాలస్వామి పేర్కొన్నారు. మంగళవారం ప్రజాబాటలో భాగంగా పట్టణంలోని శ్రీరాంనగర్, పెద్దమ్మకాలనీల్లో జిల్లా అధికారి ఎస్‌ఈ నారాయణనాయక్, డీఈఈ భాషా, ఏడీఈ రమణారెడ్డి, ఏఈ రామ్మూర్తి, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి విద్యుత్ సమస్యలు తెలుసుకుని మాట్లాడారు. లోవోల్టేజీ సమస్యతో పాటు ఇతర ఏ సమస్య ఉన్నా నేరుగా ప్రజల వద్దకెళ్లి తెలుసుకుని, పరిష్కరించేందుకే ప్రజాబాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

- మెదక్ ఆర్డీవో రమాదేవి



అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న రమాదేవి

అల్లాదుర్గం/రేగోడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అధికారులకు సూచించారు. మంగళవారం అల్లాదుర్గం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించి, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో, భూభారతి, ప్రజావాణి, మీ సేవా కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులపై ఆరాతీశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే రేగోడు మండలం తాటిపల్లి శివారులో ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ పంపు స్థలాన్ని ఆర్డీవో రమాదేవి మంగళవారం పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ దత్తారెడ్డి, ఆర్‌ఐ విజయలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కార్తీక పూజలు

చిన్నశంకరంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా చిన్నశంకరంపేట సోమేశ్వరాలయంలోని దీపారాధన, ఎమ్మెల్యే రోహిత్‌రావు స్వగ్రామంలోని దుర్గామాత ఆలయంలో దీపారాధన, పుష్పార్చన, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు.

ప్రభుత్వ భూమిపై వివాదం

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ స్థలంలో ఉన్నట్లు అనధికారిక సర్వేలో వెల్లడి కావడంతో యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పత్తా లేని బిల్డర్

కాలనీవాసులకు, ప్రైవేటు వ్యక్తులకు ఇంత ఘర్షణ జరుగుతున్నా ఇళ్లు అమ్ముకుని సొమ్ము చేసుకున్న బిల్డర్లు పత్తాలేకుండా పోవడంపై పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు సైతం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో కాలనీలో ఆందోళనలు తలెత్తుతున్నాయి. భూమిని స్వాధీనం చేసుకునేందుకు ఏకంగా బౌన్సర్లను కాపలాగా పెట్టడంతో కాలనీవాసులు భయభ్రాంతులకుగురవుతున్నారు. సర్వేశాఖ ఏడీ విచారణ చేపట్టేందుకు రావడంతో కాలనీవాసులు, ప్రైవేటు వ్యక్తుల మధ్య తీవ్రవాగ్వాదం చోటుచేసుకుంది. రాజకీయ నాయకులు వివాదంలో తలదూర్చడంతో సమస్యాత్మకంగా మారింది. సమగ్ర సర్వే నిర్వహించి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని సర్వే సిబ్బంది పేర్కొన్నారు.


పారదర్శక పాలనే లక్ష్యం : కలెక్టర్



విజిలెన్స్ వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అవినీతికి తావులేకుండా పారదర్శక పాలనే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఈ ఆఫీస్ విధానాన్ని అమలు చేసి సమగ్ర పాలన దిశగా ముందుకు పోతున్నట్లు తెలిపారు. అవినీతిని నిరోధించడంలో పౌరులందరూ భాగస్వాములు కావాలన్నారు. సోమవారం నుంచి వచ్చేనెల 2 వరకు కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటీ ఫర్ నేషన్స్, ప్రాస్పర్టీ అనే థీమ్‌తో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. క్విజ్ పోటీలు, వాక్‌థాన్లు, మారథాన్, వీధి నాటకాలు, గ్రామ సభలు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విజిలెన్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, విజిలెన్స్ డీఎస్పీ సతీష్‌రెడ్డి, సీఐలు, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమంపై సబ్ కలెక్టర్ ఆరా



కంగ్టి బీసీ హాస్టల్‌లో విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాహారతి

కంగ్టి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కంగ్టిలోని ఎస్టీ బాలుర గురుకుల విద్యాలయంతో పాటు ఎస్సీ, బీసీ బాలుర హాస్టళ్లు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం రాత్రి నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి తనిఖీ చేశారు. గురుకులంలో వసతులు పరిశీలించి, విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. వసతి గృహాలు, కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు పలు సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, వార్డెన్ పండరి, తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



కొల్చారం సోషల్ వెల్ఫేర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సురేష్

కొల్చారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం అధికారి సురేష్ అన్నారు. మంగళవారం కొల్చారం సోషల్ వెల్ఫేర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చదువులో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పారిశుధ్య పనులు చేపట్టాలి'

మెదక్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో మంగళవారం పారిశుధ్య పనులతో పాటు గ్రామపంచాయతీ రికార్డులు, నర్సరీ, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి మాట్లాడారు.

సమస్యల గుర్తింపునకు బస్తీదర్శన్

రామచంద్రాపురం టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో సమస్యలు గుర్తించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి రామచంద్రారెడ్డినగర్ కాలనీలో బస్తీదర్శన్ నిర్వహించారు.

విద్యుత్‌శాఖలో ఆర్టిజన్‌లదే రాజ్యం

(5వ పేజీ తరువాయి)

ఆరోపణలున్నాయి. వీరి వ్యవహారంపై ఇటీవల కొంత మంది వినియోగదారులు ట్రాన్స్‌కో సీఎండీకి కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ముక్కుపిండి వసూలు

ఆర్టిజన్లు ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించి వసూళ్ల దందాకు పాల్పడుతున్నారు. బహుళ అంతస్తులు, అపార్టుమెంట్లు, పరిశ్రమలల్లో ప్యానల్ బోర్డు ఏర్పాటు కోసం రూ.లక్ష, పరిశ్రమల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు, కనెక్షన్లు ఇవ్వడం కోసం రూ.10 లక్షలు, వెంచర్లలో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగల కోసం ఎస్టిమేషన్లు సిద్ధం చేయాలంటే రూ.15 లక్షల-రూ.25 లక్షల వరకు రేటు నిర్ణయించినట్లు తెలిసింది. అడిగినంత ముట్టజెప్పకుంటే వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారమంతా అక్కడి ఏడీఈ), ఏఈ స్థాయి అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు విమర్శలున్నాయి.

వరంగా మారిన ఆన్‌లైన్ దరఖాస్తులు

కొంతమంది ఆర్టిజన్లు, సిబ్బంది ఆన్‌లైన్‌లో దరఖాస్తుల విషయంలో అందినకాడికి దండుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఆన్‌లైన్‌లో వినియోగదారుల ఫోన్ నెంబర్లను కాకుండా డమ్మీ ఫోన్ నంబర్లను నమోదు చేస్తూ అడ్డదారిలో మీటర్లు, ప్యానల్ బోర్డులను మంజూరు చేసినట్లు తెలిసింది. సమగ్ర విచారణ జరిపితే అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశముంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- ఆర్డీవో జయచంద్రారెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

మెదక్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఆర్డీవో జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మాసాయిపేట మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు.

- పుల్‌కల్: రైతులకు సౌకర్యవంతంగా ఉండేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఊరూరా ఏర్పాటు చేస్తున్నామని జోగిపేట డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి అన్నారు. చౌటకూర్ మండలం గంగోజిపేట గ్రామంలో డీసీఎంఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్, ఎంపీపీ మాజీ అధ్యక్షుడు భూంరెడ్డి సుభాష్‌రెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భానూరి లక్ష్మయ్య, నాయకులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కాంగ్రెస్ శేరిరాంరెడ్డిగూడెం గ్రామ అధ్యక్షుడు మినీ రమేశ్ వ్యవసాయ బోరు తీస్తుండగా మృతిచెందాడు. ఈ విషయాన్ని నాయకులు కాంగ్రెస్ యువ నాయకురాలు త్రిష దామోదర్ దృష్టికి తీసుకువెళ్లగా, రూ.పది వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.
- మెదక్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి తేమ శాతాన్ని పరిశీలించి మాట్లాడారు.
- చిన్నశంకరంపేట: వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మాలతి అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట మండలంలోని జంగరాయి, గవ్వలపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. అనంతరం రైతులు తీసుకొచ్చిన ధాన్యం తేమను పరిశీలించారు.